క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



వెంకటాపురం(కె): మండలంలోని యాకన్నగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం..యాకన్నగూడేనికి చెందిన గోగులపాటి రాణి పూరిల్లులో నివసిస్తోంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకొని పూరిల్లుకు మంటలు చెలరేగాయని తెలిపారు. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ఇల్లు పూర్తిగా కాలి బూడిదైందని తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.40 వేల నగదు, రూ.లక్ష విలువ చేసే బంగారం, బియ్యం మంటల్లో కాలిపోయాయని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మల్హర్ : మండలంలోని తాడిచర్ల బీసీ కాలనీలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. బాధితుడు గోడుగు రవి తెలిపిన వివరాల ప్రకారం బీసీ కాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డును అనుకొని ఉన్న టౌన్ ఫీడర్ వద్ద ఆదివారం ఎద్దు మేత మేస్తుండగా ఎర్త్ వచ్చి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రవి కోరారు.

గుడుంబా స్థావరంపై దాడి



మహాముత్తారం : మండలంలోని పోలారం అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ గుడుంబా స్థావరం ఏర్పాటు చేసుకుని నాటుసారా తయారు చేస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 60 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి పంచాయతీ కార్యాలయంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం, శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ బత్తిని సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని తెలిపారు. వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

రేపు ఉచిత రుమటాలజీ శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 23న హనుమకొండ కాకాజీకాలనీలోని ఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మధుకర్ ఆది వారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో రూ.2వేల విలువైన ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్లు, కీళ్లు, నడుము, మెడ తదితర నొప్పులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య పరీక్షల కోసం 78935 88057 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఉప్పు రాజును బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొజ్జంకి పూర్ణచారి ప్రకటించారు. పార్టీ బలోపేతానికి రాజు చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డికి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

‘హరిత’కు మొక్కలు సిద్ధం

గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు
- నాటేందుకు మొక్కలు రెడీ
- వేసవిలో కూలీలకు ఉపాధి



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

మొగుళ్లపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో పచ్చదనం పరిఢవిల్లాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే ఆయా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు సరిపడా మొక్కలు లభ్యం కాకపోయేది. దీంతో గ్రామంలోనే నర్సరీలను ఏర్పాటు చేసింది. నర్సరీల ఏర్పాటుతో ఇక స్థానికంగానే మొక్కలు దొరుకుతున్నాయి. హరితహారంలో భాగంగా ఏదైనా మొక్క చనిపోతే దాన్ని తొలగించి వేరే మొక్క నాటే అవకాశం ఉంది. ఇందులో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. హరితహారంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో చిన్నతరహా నర్సరీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

మొగుళ్లపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో గ్రామస్తులను మొక్కల పెంపకంపై సమాయత్తం చేశారు. ఇందుకు ప్రతి గ్రామంలో నర్సరీ పెంపకందారులను ఎంపిక చేసి అవగాహన కల్పించారు. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలు పెంచేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు అందించడం జరిగిందన్నారు.

నర్సరీలు సిద్ధం..

25 గ్రామ పంచాయతీల్లో ఎరువులు, ఎర్రమట్టితో మొక్కలు పెంచేందుకు నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. వర్షాకాలం వరకు మొక్కల నిర్వహణ కొనసాగుతుంది. ఈ ఏడాది 10వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుకూలంగా టేకు, పండ్ల మొక్కలు జామ, దానిమ్మ, నిమ్మ, కరివేపాకు, గోరింటాకు తదితర మొక్కలను పెంచుతున్నారు.మండలంలో మొత్తం సుమారు 3 లక్షల మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కూలీలకు ఉపాధి..

వేసవి కాలంలో పనులు దొరకక రోజువారీ కూలీల జీవనోపాధి కష్టతరంగా మారింది. ఈ సమయంలో నర్సరీల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లోని కూలీలకు ఉపాధి లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నర్సరీలో రోజు కనీసం 10 మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. వారికి ఉపాధి హామీ పథకం ద్వారా వారం లేదా 15 రోజులకు ఒకసారి కూలి డబ్బులు చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు, ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ



ఈ ఏడాది హరితహారం కార్యక్రమం నిర్వహణకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ నర్సరీలతో పలువురికి ఉపాధి లభిస్తుంది. గ్రామస్తులకు ఉపయోగకరంగా, మొక్కలు అందుబాటులో ఉంటాయి. నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నాం.

– వీరస్వామి, ఇన్‌చార్జ్, ఎంపీడీఓ

చొక్కాల శివారులో గంజాయి స్వాధీనం



యువకులను అరెస్టు చూపుతున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండలంలోని చొక్కాల గ్రామ శివారుల్లో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు ఆదివారం చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చొక్కాల గ్రామ సమీపంలో కొంతమంది వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారం మేరకు వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. చొక్కాల గ్రామ శివారుల్లోని శ్మశానవాటిక సమీపంలో ఐదుగురు గంజాయి తాగుతూ కనిపించారని తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బొల్లె హేమంత్, అలువాల రోహిత్, జాబీర్, చొక్కాల గ్రామానికి చెందిన గారపు కార్తీక్, వీఆర్‌కే పురం గ్రామానికి చెందిన వేల్పుల ఉపేందర్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకొని వారి నుంచి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

చిట్యాల : మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఎండీ రాజ్‌మహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జ్యోతిరావు పూలే గురుకులంలో సీట్లు సాధించిన కోరే రితిక, మూసపూరి వైష్ణవి, చింతల సహస్ర, సంద శ్రీనివితలను ఘనంగా సన్మానించి షీల్డ్ బహూకరించి అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కరస్పాండెంట్ కోరారు.

ఒకరిపై కేసు నమోదు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై

టేకుమట్ల : మద్యం తాగి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా రాఘవపూర్ గ్రామానికి చెందిన జాల రమేశ్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా అతనిపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భిక్షపతి



పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

చిట్యాల : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 459 మంది విద్యార్థులకు గాను 429 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

- కాంగ్రెస్ యువనాయకుడు శ్రీనుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనుబాబు

కాటారం : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని దేశ ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ యువనాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు తెలిపారు. అలాగే పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు. కాటారం మండలం ధన్వాడలోని మంత్రి స్వగృహంలో ఆదివారం కాటారం సబ్ డివిజన్‌లోని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో శ్రీనుబాబు సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు కోసం అనుసరించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మంథని నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో అధిక మెజార్టీ తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, మల్హర్‌రావు, బాన్సోడ రాణిబాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండే పార్కింగ్ స్థలం



బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

రేగొండ : మండలంలోని భాగిర్థిపేట క్రాస్ వద్ద గల బస్టాండ్‌లో వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుంటున్నారు. ఎండలు తీవ్రమవుతుండడంతో పరకాల–భూపాలపల్లి వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపైనే పడిగాపులు కాస్తు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. భాగిర్థిపేట, దుంపిల్లపల్లి, గూడెపల్లి గ్రామాల ప్రజలు ఎక్కువగా ఇక్కడి నుంచే పరకాల, వరంగల్, భూపాలపల్లి, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. దీంతో గత ప్రభుత్వంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారి నిధులతో బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్ నిర్మించడమే తప్ప దాని పర్యవేక్షణను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులు కూర్చుండే విధంగా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



మంగపేట: నిరుపేద కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న యూత్ సభ్యులు



ములుగు రూరల్ : శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి జ్వాలా యూత్, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. గత ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన అన్న జన్మదినం సందర్భంగా అతని తమ్ముడు జ్వాలా యూత్, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. మండలంలోని మల్లూరుకు చెందిన అటిక సాయి 2022 జూలైలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం సాయి పట్టిన రోజు కావడంతో తన తమ్ముడు హరివర్మ నిరుపేద కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశాడు. ఈ సందర్భంగా హరివర్మను జ్వాలా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కోడెల నరేష్ అభినందిస్తూ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ హరివర్మను ఆదర్శంగా తీసుకొని నిరుపేదలు, అభాగ్యులకు తగినంత సాయం అందించి ఆదుకోవాలని ఆకాంక్షించారు.

కాశిందేవిపేటలో..

ములుగు రూరల్ : మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన చెలిమల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా పరామర్శించారు. ఈ మేరకు ఆదివారం శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు చేయూతనందించారు. పరామర్శించిన వారిలో ఎన్నింండ్ల ప్రదీప్, దేవరనేని సుధాకర్‌రావు, దేగ్యాల దేవేందర్‌రావు, కట్ల సతీష్, మద్రి అయిలుమల్లు, దేవేందర్‌రెడ్డి, కిరణ్ ఉన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనాల పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు

గోవిందరావుపేట : పశువులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పస్రా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం ..ములుగు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తన సిబ్బందితో కలిసి పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోవిందరావుపేటలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మూడు వాహనాలు డీసీఎం నంబర్ టీఎస్ 06యూసీ6863, బొలెరో గూడ్స్ వాహనాల నంబర్స్ టీఎస్ 24టీ9402, టీఎస్15యుఈ1717 గల వాహనాలు అనుమానాస్పద స్థితిలో ములుగు వైపు వెళ్తుండగా వాటిని వెంబడించి పట్టుకొని చూడగా 3 వాహనాల్లో మొత్తం 54 పశువులను బంధించి తరలిస్తున్న గుగులోత్ బాలాజీ, బుధరావుపేటకు చెందిన ధరమ్‌సోత్ శ్రీను, కొమ్మాలకు చెందిన పల్లె ప్రభుదేవా, ఎదునూరి యుగేంధర్, మల్లంపల్లికి చెందిన కనకమ్ నరేష్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఆ పశువులను చర్ల నుంచి అక్రమ రవాణా చేస్తున్నామని ఒప్పుకోవడంతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.ఎస్సై మాట్లాడుతూ పశువులను అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరం అని, ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫైబర్ గుంత..తస్మాత్ జాగ్రత్త

- రోడ్డుపైనే మట్టికుప్పలు



రోడ్డు పక్కన పైపులైన్ కోసం తీసిన మట్టి కుప్ప

పలిమెల : మండలంలోని సర్వాయిపేట–బూరుగ్గుడెం రహదారిలో ఫైబర్ పైపులు వేసేందుకు పొక్లెయినర్‌తో గోతులు తీసి పైపులు వేశారు. కానీ సర్వాయిపేట నుంచి బూరుగ్గుడెం వెళ్లే దారిలో పలుచోట్ల సింగల్ రోడ్డు ఉన్నప్పటికీ సగం వరకు మట్టిని రోడ్డుపైనే పోశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే రాత్రి పూట వాహనాలు ఎదురుపడితే ఇక మట్టి కుప్పల్లో ఇరుక్కోవడం లేదా గుంతల్లో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కాగా అధికారులు స్పందించి వెంటనే మట్టికుప్పలను తొలగించి గుంతలు పూడ్చాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

మల్హర్ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ఓ గార్డెన్స్‌లో నేడు(సోమవారం) నిర్వహించే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేష్ మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన దగ్గరి నుంచి బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవితో పాటు అంకుషాపూర్ మాజీ సర్పంచ్ పండుగ శ్రీను, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాటం వెంకటేష్, ఆరెపల్లి సీనియర్ నాయకులు కుర్రె మల్లయ్య, పలు గ్రామాల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్పీ కంటంగూర్ రాంనర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ (కొత్తపల్లిగోరి) : కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి మాజీ సర్పంచ్ దంపతులతో పాటు పలువురు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాంర్డె శ్రీనివాస్, చిగురుమామిడి రాజేందర్, పనాస శంకర్, నాంర్డె రవీందర్, పున్నం శ్రీనివాస్, గజ్జెల్లి రవి, గిరవేన మల్లయ్య, బోడ రఘురామ్ నాయక్, కోడెపావ రాజు, కొమురయ్య, తిరుపతి, కానుగంటి చంద్రమౌళిలో పాటు 50 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, నాయిని సంపత్‌రావు, సుల్తాన్‌పూర్ ఎంపీటీసీ గండు కుమారస్వామి, నాయకులు గూటోజు కిష్టయ్య, పుల్లూరి బాపురావు, పున్నం రవి, సూదనబోయిన ఓంప్రకాష్, ప్రేమాజీ, వెంకటేశ్వర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కాడవేన వెంకటేష్, మాజీ ఎంపీటీసీ గండు కుమారస్వామి, నాయకులు కాడవేన భాస్కర్, జ్ఞానేందర్, గాజె వీరన్న, కుమారస్వామి, దైనంపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యులు..

చిట్యాల : మండలంలోని నవాబుపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు శివరాత్రి అనిల్ ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి



రాజు నాయక్ (ఫైల్)

కాటారం : మండలంలోని గంట్లకుంటకు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్ అజ్మీరా రాజు నాయక్(50) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రాజు నాయక్ చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. కాగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం మధ్యాహ్నం రాజు నాయక్‌ను ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వైద్యులతో మాట్లాడారు. రాజు నాయక్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.